సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



బిజ్వారంలో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అఖిల పక్ష నాయకులు

• అఖిలపక్ష కమిటీ డిమాండ్

మల్దకల్, అక్టోబర్ 28 : మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక రాజేశ్వరి (16) ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని అఖిల పక్ష కమిటీ సభ్యులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఎక్బాల్, ప్రభాకర్, ఆంజనేయులు తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం అఖిల పక్ష కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు గ్రామానికి చేరుకొని రాజేశ్వరి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో జరిగిన విషయాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ కమిటీ సభ్యులు గ్రామానికి వస్తున్నట్లు సమాచారం రావడంతో రాజేశ్వరి తల్లిని మాయం చేశారన్నారు. బండ్ల రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మల్దకల్ పోలీస్‌స్టేషన్‌కు రాజేశ్వరి, ఆమె పెద్దమ్మను తీసుకొచ్చారని అయితే పెద్దమ్మను స్టేషన్ బయటే ఉంచి కేవలం రాజేశ్వరిని మాత్రమే స్టేషన్‌లోకి తీసుకెళ్లి విచారించడంతో, పోలీసుల తీరుకు భయపడి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని రాజేశ్వరి పెద్దమ్మ చెప్పిందని వారు అన్నారు. చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలిస్తే పోలీసులు అక్కడి వెళ్లి బెదించారని దీంతో బాలిక భయంతోనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దొంగతనం బాల కార్మికురాలిపై మోపడం ఎంత నేరమో పనిలో పెట్టుకోవడం కూడా అంతే నేరమన్నారు. రాజేశ్వరి మృతదేహాన్ని పూడ్చడానికి పోలీసులు చూపిన శ్రద్ధ నిందితుడిని అరెస్టు చేయడంలో చూపకపోవడం అనుమనాలకు తావిస్తున్నదన్నారు. మల్దకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి ఈ దొంగతనం కేసు రాకున్నా అతి చొరవతో బాలిక మరణానానికి కారణమైన ఎస్సైపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాలిక ఆత్మహత్యకు కారకులైన నిందితులను అదుపులోకి తీసుకొని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల పక్ష కమిటీ సభ్యులు మహిళా సంఘాల, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ

• ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, అక్టోబర్ 28 : పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారందరినీ స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఎస్పీ పాల్గొని జెండా ఊపి ప్రారం భించారు. ఈ ర్యాలీ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై బస్టాండ్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు ఉత్సాహంగా సాగింది. ర్యాలీలో జిల్లాలోని యువకులు, విద్యార్థులు, వాకర్స్, పోలీస్ అధికారులు, సిబ్బంది 200 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ అంతర్గత భద్రతలో భాగంగా విధులు నిర్వర్తిస్తూ ప్రతి ఏడాది ఉగ్రవాదుల చేతుల్లో , సంఘ విద్రోహుల చేతుల్లో ఎంతో మంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని తెలిపారు. వారందరిని స్మరించుకుంటూ ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు ఈ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్, ఏఆర్‌డీఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర రావు, సీఐలు కృష్ణ, రాంబాబు, శివకుమార్, జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి 8 ఫిర్యాదులు

జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 8 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రావుల గిరిధర్ చెప్పారు. ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని సంబంధిత పోలీస్ అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. 8 ఫిర్యాదులు అందగా 4 భూతగాదాలు, 4 పరస్పర గొడవల ఫిర్యాదులు అందాయని ఆయన చెప్పారు.

ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తోట శ్రీనివాసరావు

• ఎస్పీ తోట శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, అక్టోబర్ 28 : ప్రజావాణి ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించాలని ఎస్పీ తోట శ్రీనివాసరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి నేరుగా ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. భూవివాదాలకు సంబంధించి 4 , గొడవలవి 2 , కుటుంబ తగాదా లవి 2 , ఇతర అంశాలకు సంబంధించి 3, మొత్తం 11 ఫిర్యాదులను ఆ యన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ వృద్ధులను చూసుకోవాల్సిన బాధ్యత వారి సంతానంపై ఉం టుందని, వారి నుంచి కూడా ఫిర్యాదులు రావడం చాలా బాధాకరమన్నారు. అ లాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

• కలెక్టర్ సంతోష్

గద్వాల, అక్టోబర్ 28 : ప్రజావాణికి వచ్చే సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అదనపు కలెక్టర్లతో కలిసి ప్రజల నుంచి వచ్చిన 35ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ రావు, ఆర్డీవో రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ ఏర్పాటు చేసిన పశుగణన కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 21వ అఖిల భారత పశుగణన తెలంగాణ సర్వే కార్యక్రమం జిల్లాలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ ప్రక్రియలో ఆవులు, గేదెలు, గొర్రెలు, కోళ్లు, మేకలు ఇతర జంతువుల సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో నిక్షిప్తం చేస్తారన్నారు. జిల్లాలోని 12మండలాలకుగానూ ఒక నోడల్ అధికారి 12మంది సూపర్‌వైజర్లు, 44 మంది ఎన్యుమరేటర్లు కలిసి జిల్లాలోని ప్రతి నివాస గృహాన్ని సందర్శించి పశుగణన వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. ఈ వివరాల సేకరణలో ప్రజా ప్రతినిధులు పాడి రైతులు, పశుపోషకులు, గొర్లకాపరులు ప్రతి ఒక్కరూ సహకరించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలన్నారు. ఈ వివరాల ద్వా రా మాంసం, గుడ్డు, పాల ఉత్పత్తులు గణించి పశుసంవర్ధక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో రాంచందర్, పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు, అధికారులు షకీలాభాను, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

డయేరియా,ఎనీమియా ముక్త్ భారత్ వాల్‌పోస్టర్ విడుదల

కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్‌ను అదనపు కలెక్టర్‌లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోస్టర్ల ద్వారా ప్రజలకు నీళ్ల విరోచనాల వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సిద్ధప్ప, ఆర్డీవో రాంచందర్, జిల్లా సంక్షేమశాఖ అధికారిణి సుధారాణి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ముగిసిన ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారుల పర్యటన

గద్వాల రూరల్, అక్టోబర్ 28 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం 25మంది ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులతో కలెక్టర్ సంతోష్ సమావేశం నిర్వహించారు. వారం రోజులుగా జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రభుత్వ విభాగాల తమ పరిశీలన ఫలితాలు, అనుభవాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను అభినందిస్తూ ఈ అనుభవాలు మీ భవిష్యత్ ఉద్యోగ జీవితంలో ఉపయోగపడుతాయని, ప్రజాసేవ కోసం ఇది మంచి శిక్షణగా నిలుస్తుందని అభిప్రాయం వెల్లడించారు. అలాగే శిక్షణాధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ పథకాలు, పురపాలక సంస్థల పనితీరు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లాలోని చేనేత పరిశ్రమ, ఆలయాలు, మార్కెటింగ్, ఉపాధి అవకాశాలు, ప్రసాద్ స్కీం, మహిళా శక్తి పథకాలు వంటి అంశాలపై తమకు అవగాహన పెరిగిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పీ సీఈవో కాంతమ్మ, ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వేకు సన్నద్ధం కావాలి

• వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, అక్టోబర్ 28 : త్వరలో ప్రారంభమయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, యం.నగేశ్, జిల్లా అధికారులు, తాసీల్దార్లతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం త్వరలో పూర్తిస్థాయి విధివిధానాలు జారీ చేస్తారని తెలిపారు. జిల్లాలో ఏఒక్క ఇల్లు , కుటుంబం వదలకుండా అన్ని కుటుంబాలు, సర్వేలో నమోదయ్యే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. 2011సర్వే ప్రకారం ఉన్న ఎన్యుమరేషన్ బ్లాక్‌లను గుర్తించి వాటి ప్రకారం మున్సిపాలిటీ , గ్రామస్థాయిలో ఎన్యుమరెటర్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, వీఏలోలను ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేయాలని సూచించారు. మండలస్థాయి కార్యాలయాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్, ఎంపీడీవో, ఎంపీవోలు తదితర సిబ్బందిని సూపర్‌వైజర్లుగా ఎంపిక చేస్తానని, మండల నోడల్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులను ఎంపిక చేసి సమగ్ర ప్రణాళికతో సర్వేకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సర్వేపై మాస్టర్ ట్రైనర్లతో త్వరలో మండల, గ్రామస్థాయి శిక్షణ ఇస్తామని తెలిపారు. వనపర్తి జిల్లాలో 5 మున్సిపాలిటీలతోపాటు 228 రెవెన్యూ గ్రామాలు అందులో 262గ్రామ పంచాయతీల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, 2011 తర్వాత కొత్తగా ఏర్పడిన అవాస ప్రాంతాలు, ఇండ్లను గుర్తించి ఎన్యుమరేటర్ బ్లాక్‌లు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, యం.నగేశ్‌లతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రజావాణి ద్వారా జిల్లాకు వచ్చిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణికి మొత్తం 51 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

అవినీతి నిర్మూలనకు ప్రతిజ్ఞ

సమాజంలో అవినీతిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సూచన మేరకు అధికారులు, సిబ్బందితో జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. దేశ పౌరుడిగా అవినీతిని ప్రోత్సహించనని, అవినీతికి పాల్పడనని దేశాన్ని అవినీతిరహితంగా రూపుదిద్దడంలో నావంతు కృషి చేస్తానని ప్రమాణం చేయించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో పద్మావతి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్, తాసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల

అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం నుంచి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా ఉంచుతామని, ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లి పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 2న వెలువరించిన ఓటరు తుది జాబితా ప్రకారం వనపర్తి జిల్లాలో 2,72,653మంది ఓటర్లు ఉండగా ప్రస్తు తం 2,74,887మంది ఓటర్లు ఉన్నారు. 5,455మంది కొత్త ఓటర్లు నమోదు చేసుకోగా 3,221మంది పేర్లు ఫారం 7 ద్వారా తొలగించామన్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు 1,36,208 కాగా మహిళా ఓటర్లు 1,38676 మంది ఉన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను డిసెంబర్ 24వరకు పరిష్కరించి జనవరి 6న తుది జాబితా వెలువరిస్తారని తెలిపారు.

తాసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న తపస్ సంఘం నేతలు

ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వ వైఖరి మారాలి

వనపర్తి టౌన్, అక్టోబర్ 28 : ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏల విడుదల విషయంలో ప్రభుత్వ వైఖరి శోచనీయంగా ఉందన్నారు. ఒకే డీఏ విడుదల చేయడంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ చెందారన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్సీ రిపోర్ట్‌ను వెల్లడించి మెరుగైన పిట్ మెంట్ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా 317బాధితులందరికీ స్థానికత ఆధారంగా సొంత ప్రాంతాలకు కేటాయించాలని, ఆదాయ పన్ను చెల్లింపు రూ.12లక్షలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అమీద్, జిల్లా సహాయ కార్యదర్శులు వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, తిమ్మప్ప, చిరంజీవి, కృష్ణయ్య, రామన్‌గౌడ్, చంద్రయ్య, సూరయ్య, ఆంజనేయులు, శరత్ ఉన్నారు.

విజయవంతమైన ధర్మగ్రహ దీక్ష

జిల్లా కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట తపస్ సంఘం ఆధ్వర్యంలో తపస్ సంఘ ధర్మగ్రహ దీక్షను సోమవారం నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు రాముడు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డీఏలు, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ రిపోర్ట్‌ను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తపస్ సంఘం నాయకులు శ్రీనివాసులు, కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్‌గౌడ్, భాస్కర్, మనోహర్, కిరణ్, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, ప్రసన్నకుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మదనాపురం, అక్టోబర్ 28 : ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. ధర్మగ్రహ దీక్ష నిరసన కార్యక్రమంలో భాగంగా తపస్ సంఘం ఉపాధ్యాయులు సోమవారం తాసీల్దార్ అబ్రహం లింకన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఏలు, పీఆర్సీ, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, మెడికల్ బిల్లు, సప్లిమెంటరీ బిల్లులకు సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తపస్ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కిరణ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు కన్వీనర్ రామ్మోహన్, మహేందర్‌గౌడ్, ఈశ్వర్‌లాల్, కృష్ణ ప్రసాద్, దేవా, సుజాత పాల్గొన్నారు.

డీటీకి వినతిపత్రం అందజేత

ధరూరు, అక్టోబర్ 28 : ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డీఏలు, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తపస్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. టీపీయూఎస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు వారు సోమవారం డిప్యూటీ తాసీల్దార్ అలివేలు మంగతాయారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిటీ రిపోర్ట్ తెప్పించుకుని డీఏలు, పెండింగ్ బిల్లును వచ్చే నెల 22తేదీలోగా పరిష్కరించాలని, లేకపోతే మరసటి రోజు హైదరాబాద్‌లో ధర్మగ్రహదీక్ష చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తపస్ నాయకులు ప్రవీణ్ కుమార్, లక్ష్మీనారాయణ, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, మోహన్, హరివంశీ, రాజేశ్, సురేశ్, చక్రవర్తి, సురేందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని వ్యక్తి మృతి

మల్దకల్, అక్టోబర్ 28 : బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సద్దలోనిపల్లి గ్రామ స్టేజీ సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రామన్న మండల కేంద్రానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో తన బైక్‌పై గ్రామానికి వస్తుండగా గద్వాల నుంచి అయిజ వెళ్తున్న బస్సు ఢీకొట్టిందన్నారు. రామన్నకు గాయాలు కావడంతో అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ దవాఖానకు అటునుంచి కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

పరసర్వ గొడవ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష , జరిమానా

వనపర్తి టౌన్, అక్టోబర్ 28: గోపాల్‌పేట మండలంలో పరస్పర గొడవలో గాయపర్చిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ రెండో అదనపు ప్రధాన జడ్జి జై.జానకి సోమవారం తీర్పును వెల్లడించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. గోపాల్‌పేటకు చెందిన బత్తుల నాగశేషి, బత్తుల చిన్న బుచ్చన్న పొలం వద్ద 2021, డిసెంబర్ 22న బాట విషయంలో గొడవ పెట్టుకొని రాయి తీసుకొని తలపై మోదడంతో బలమైన గాయమైంది. ఈ విషయాన్ని నాగశేషి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చిన్న బుచ్చన్నపై కేసు నమోదు చేసుకొని విచారించి తీర్పు ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన న్యాయవాది, వనపర్తి సీఐ కృష్ణ, గోపాల్‌పేట ఎస్సై నరేశ్, కోర్టు కానిస్టేబుల్ రమేశ్‌లను డీఎస్పీ అభినందించారు.

రైతు నిరసన సదస్సును విజయవంతం చేద్దాం

గోపాల్‌పేట, అక్టోబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం వనపర్తి పట్టణంలో నిర్వహించనున్న రైతు నిరసన సదస్సుకు పార్టీ శ్రేణులు, రైతులు, ప్రజలు భారీగా తరలిరావాలని బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు బొల్లెద్దుల బాలరాజు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధ్యర్యంలో నిర్వహిం చే నిరసన సదస్సుకు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ ఉప సర్పంచ్ శివ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, రైతు బంధు సమితి అధ్యక్షుడు మణ్యెం నాయక్ నాయకులు కాశీనాథ్, గోపాల్ పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పాటుపడదాం

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తూ పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

ఆత్మకూరు, అక్టోబర్ 28: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పాటుపడదామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ కురుమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, ఆత్మకూరు కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కళాశాలలో ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీఐ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత తెలంగాణే ధ్యేయంగా జీవించాలని కోరుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌ను వ్యతిరేకిస్తూ ప్రచురించిన పోస్టర్లను ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి విడుదల చేశారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

వనపర్తి టౌన్, అక్టోబర్ 28 : జిల్లా కేంద్రంలోని నాగవరం 10వ వార్డుకు చెందిన సాయిరెడ్డి మాతృమూర్తి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం ఇంటికి వెళ్లి మృతురాలి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సాయిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కేటీఆర్ ఇంటిపై దాడి అమానుషం

గట్టు, అక్టోబర్ 28 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇంటిపై రేవ్ పార్టీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అకారణంగా దాడి చేయించడం అమానుషమైన చర్య అని బీఆర్ఎస్ ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అంగడి బస్వరాజు సోమవారం ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజల దృష్టికి మరల్చడానికి ఈ పన్నాగం పన్నిందని ఆరోపించారు. గృహ ప్రవేశంలో చిన్నాపెద్దా గడుపుతుంటే పోలీసులు ఈవిధంగా దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజాపాలన చేతగాక పోవడంతో కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోందని, ఈ సమయంలో లేనిపోని అభాండాలు మోపితే ప్రజలు తమ దృష్టి మరులుతారనే ఆలోచన కాంగ్రెస్‌కు ఉందని ఎద్దేవా చేశారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

వనపర్తి